

వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు, దర్శించుకుంటున్న భక్తులు

# చిల్పూరు వెంకన్నకు అష్టాదశ పాద పద్మారాధన పూజలు

చిల్పూరు, అక్టోబర్ 3: మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మంగళవారం అష్టాదశ పాద పద్మారాధన పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేశారు. అనంతరం వేంకటేశ్వరస్వామికి 108 బంగారు పుష్పాలతో అష్టాదశ పాద పద్మారాధన పూజ నిర్వహించారు. ఆలయ చైర్మన్ పోట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో బీ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. ఈ పూజా కార్యక్రమం ప్రతి నెలలో మంగళవారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పోతరాజు లక్ష్మి-సురేశ్, వెలదండి శిరీష-అశోక్, ఎడ్ల మంజుల-ఆనందర్‌రావు, పోతరాజుల అక్షిత-విష్ణు దంపతులు, ఆలయ శాశ్వత దాత దేవస్థానం మాజీ డైరెక్టర్ సంగోజు లక్ష్మి-మోహన్ దంపతులు, ఆలయ డైరెక్టర్లు కుంచాల సంపత్‌రాజ్, రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వేల్పుల గట్టయ్య, ప్రధాన అర్చకులు బ్రహ్మానపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, కృష్ణ, మహేశ్, మల్లికార్జున్, విశాల్, రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సై వినయ్‌కుమార్, ఫొటోగ్రాఫర్లు

## 'ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో' పోస్టర్ ఆవిష్కరణ

చిల్పూరు, అక్టోబర్ 3: మండల కేంద్రంలోని ఫొటో గ్రాఫర్స్‌తో కలిసి, మండల ఫొటో గ్రాఫర్స్ అధ్యక్షుడు కేసోజు రాజేంద్రచారి ఆధ్వర్యంలో ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ మంగళవారం 'ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 6,7,8 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో'ను మండలంలోని ఫొటో గ్రాఫర్స్ వినియోగించుకోవాలని రాజేంద్రచారి సూచించారు. కార్యక్రమంలో జిల్లా సమాయక కార్యదర్శి కర్ణకంటి నాగరాజు, కుమార్, సంఘం సభ్యులు సోమ రవి, ద్రాక్షపెల్లి వరప్రసాద్, వద్దుల కుమార్, నారగోని రాజశేఖర్, కొయ్యడ శ్రావణ్‌కుమార్, అన్నం సంతోష్, మచ్చ కంటి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సై ప్రవీణ్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

## ఎస్సై ప్రవీణ్‌కు యూనియన్ నాయకుల సన్మానం

లింగాలఘనపురం, అక్టోబర్ 3: మార్బుల్స్, టైల్స్, గ్రానైట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం లింగాలఘనపురంలో ఎస్సై ప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనగామ డివిజన్‌లో యూనియన్‌ను ఏర్పాటు చేసుకొని గృహస్తులకు నాణ్యమైన మెటీరియల్ అందిస్తూ, సరసమైన కూలీలు తీసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. కొన్ని రోజులుగా ఆంధ్ర, రాజస్థాన్, బీహార్, కర్నూల్ ప్రాతాల నుంచి వచ్చి కొందరు తక్కువ కూలీలకు పనులు చేస్తూ తమ జీవనోపాధిని పోగొడుతున్నారన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు జాయరాజు, ఉపాధ్యక్షుడు మునిగె రమణాకర్, ప్రధాన కార్యదర్శి సముద్రాల రాజు, కోశాధికారి ముక్కెర రాజు, సమాచార కార్యదర్శి ఏదునూరి సమ్మయ్య, గౌరవ అధ్యక్షులు బొజ్జ రాజు, ఎల్లస్వామి, దార రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు సర్కారు సారె

- జిల్లాకు చేరిన 1.80 లక్షల బతుకమ్మ చీరెలు
- 25 రంగులు, 25 డిజైన్లు, 525 వెరైటీలు..
- సిరిసిల్ల, పోచంపల్లి నేత కార్మికులతో తయారీ
- నేటి నుంచి చీరెల పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా 1,78,086 మంది లబ్ధిదారులకు అందనున్న కానుక



జిల్లా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న బతుకమ్మ చీరెలు



జనగామ చౌరస్తా, అక్టోబర్ 3: ఏటా బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర సర్కారు ఆడబిడ్డలకు కానుకగా సారె అందిస్తున్నది. అన్ని మతాల పండుగలను సమానంగా చూస్తున్న ప్రభుత్వం రంజాన్ పండుగకు ముస్లింలకు, క్రిస్మస్ పండుగకు క్రిస్టియన్లకు గిఫ్ట్‌ప్యాక్‌లు, బతుకమ్మ పండుగకు తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ చీరెలను పంపి ణీ చేస్తూ ప్రజల సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తున్నది. ఈ సారి 10 రంగులు, 250 డిజైన్లలో నాణ్యతతో తయారు చేసిన చీరెలను నేటి నుంచి పంపిణీ చేసేలా అధికా ర యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లాలో తెల్ల రేషన్‌కార్డు కలిగిన, 18 ఏళ్లు పైబడిన మహిళలందరికీ రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా చీరెలను అందించనున్నారు. జిల్లా లో మొత్తం 2 లక్షల 9 వేల 513 మంది అర్హులు ఉండగా, 1 లక్ష 80 వేల చీరెలు, 85 శాతం మేర ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయి. ఇక్కడి నుంచి 1 లక్ష 77 వేల 493 చీరెల బండిల్స్‌ను జిల్లాలోని 12 మండలాలతో పాటు జనగామ అర్బన్ మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు తరలించారు. మిగతా 2,507 చీరెలను జిల్లా కేంద్రంలోని గోదాం లో అధికారులు భద్రపర్చారు. ఎక్కడైనా చీరెలు తక్కువ పడితే అక్కడ వీటిని పంపిణీ చేస్తారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న అన్ని రేషన్ షాపులకు బతుకమ్మ చీరెల బండిల్స్‌ను చేర్చారు. బుధవారం నుంచి స్థానిక ప్రజా ప్రతినిధులు మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేయడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు.

### 250 రకాల సరికొత్త డిజైన్లు..

ఈ ఏడాది జరీతో పాటు వివిధ రకాల కాంబినేషన్‌తో 250 రకాల సరికొత్త డిజైన్లతో టెస్కో ఆధ్వర్యంలో చీరెలు తయారు చేశారు. వంద శాతం పాలిస్టర్ ఫిలిమెంట్ నూలుతో దారపు పోగుల అంచుతో మరింత నాణ్యం గా చీరెలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

| మండలం | అర్హుల సంఖ్య | వచ్చిన చీరెలు | పంపిణీకి సిద్ధంగా ఉన్నవి |
|---|---|---|---|
| బచ్చన్నపేట | 17,221 | 14,638 | 14,640 |
| చిల్పూరు | 15,915 | 13,528 | 13,560 |
| దేవరుప్పుల | 16,517 | 14,039 | 13,800 |
| స్టేషన్ ఘన్‌పూర్ | 20,157 | 17,133 | 17,133 |
| జనగామ | 16,092 | 13,678 | 13,680 |
| జనగామ అర్బన్ | 16,613 | 14,121 | 13,800 |
| కొడకండ్ల | 12,327 | 10,478 | 10,440 |
| లింగాల ఘన్‌పూర్ | 15,891 | 13,507 | 13,560 |
| నర్మెట | 9,203 | 7,823 | 7,800 |
| పాలకుర్తి | 23,722 | 20,164 | 20,160 |
| రఘునాథపల్లి | 22,129 | 18,810 | 18,720 |
| తరిగొప్పుల | 7,401 | 6,291 | 6,280 |
| జఫర్‌గఢ్ | 16,325 | 13,876 | 13,920 |
| మొత్తం | 2,09,513 | 1,78,086 | 1,77,493 |



### నేటి నుంచి పంపిణీ చేస్తారు..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి జిల్లాలో రేషన్ దుకాణాల ద్వారా అర్హులైన మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కలిసి చీరెలు అందజేశారు. ఈ ఏడాది జిల్లాకు 1.80లక్షల చీరెలు రాగా, 12 మండలాలతో పాటు జనగామ మున్సిపాలిటీలోని 30 వార్డులకు కలిపి మొత్తంగా 1,77,493 చీరెలను పంపిణీ చేశాం. మరో 2,507 చీరెలను గోదాంలో భద్రపర్చాం. జిల్లాలో ఎక్కడైనా అర్హులకు చీరెలు తక్కువ పడితే వాటిని అందజేస్తాం. ఈ సారి 250 రకాల సరికొత్త డిజైన్లతో చీరెలు వచ్చాయి.

*-వసంత, డీఆర్డీవో, జనగామ*

# గెలుపు ఖాయం.. మెజార్టీయే లక్ష్యం

- వార్ వన్‌సైడే..
- కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- జడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి



లింగాలఘనపురంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి

లింగాలఘనపురం, అక్టోబర్ 3: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజక వర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి గెలుపు కాయమైందని, వార్ వన్‌సైడే అయిందని జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి అన్నారు. మండలంలో బుధవారం కడియం శ్రీహరి పర్యటించనున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో జడ్పీటీసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు బాటలు వేస్తున్నాయన్నారు. మండలంలోని చీటూరు, కిష్టగూడెం, కుందారం, బండ్లగూడెం, లింగాలఘనపురం, నాగారంలో కడియం శ్రీహరి ఈ నెల 4న పర్యటిస్తారని తెలిపారు. సమావేశాల్లో పార్టీ జిల్లా నాయకుడు చిట్ల ఉపేందర్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, గవ్వల మల్లేశం, విండో అధ్యక్షుడు బుషిగంపల ఉపేందర్, మల్గ శ్రీశైలం, నాయకులు బొల్లంపెల్లి నాగేందర్, చౌదరపెల్లి శేఖర్, దుంబాల భాస్కర్‌రెడ్డి, కేమిడి యాదగిరి, బుషిగంపల ఆంజనేయులు, ఎడ్ల రాజు, ఎండీ జానీమియా, లింగాల వెంకటేశ్, బోయిని జంపన్న, బెజ్జం చంద్రయ్య, బోయిని యాకూబ్, గూటం రవి, నాగిడి నర్సిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామశాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఆశిశ్ మిశ్రాను కఠినంగా శిక్షించాలి

పాలకుర్తి, అక్టోబర్ 3: లక్కింపూర్ కేరిలో రైతుల మృతికి కారణమైన కేంద్ర సహాయ మంత్రి అజయ్‌మిశ్రా తనయుడు ఆశిశ్ మిశ్రాను కటినంగా శిక్షించాలని, అజయ్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించాలని ఏఐకేఎస్, సీఐటీయూ, ఏఐఏడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నిరసన ప్రదర్శన చేసి, అనంతరం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందూ నాయక్ మాట్లాడారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఉపాధి పథకంలో 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.600ల వేతనం చెల్లించాలన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి సోమయ్య, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సారయ్య, జిల్లా కమిటీ సభ్యులు శ్రీలత, సమ్మన్న పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

## ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

పాలకుర్తి, అక్టోబర్ 3: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమార్పీఎస్, ఎంపీఎస్ అధికార ప్రతినిధి ఇల్లబెల్లి యాకయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏబీసీడీ వర్గీకరణ బిల్లు కోసం అనేక పోరాటాలు చేస్తున్నామని, ఇప్పటికైనా కేంద్రం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఎడవెల్లి కుమార్, మండల అధ్యక్షుడు బల్లుల పెద్ద యాకయ్య, సందీప్ పాల్గొన్నారు.